క్లుప్తంగా

రూ. 10కే ఓపీ వైద్య సేవలు



గుంటూరు మెడికల్: మూడో వార్షికోత్సవం పురస్కరించుకుని రూ. 10కే ఓపీ వైద్య సేవలు అందిస్తున్నామని హోప్ విన్ హాస్పిటల్స్ అధినేత, సీనియర్ ల్యాప్రోస్కోపిక్ సర్జన్ డాక్టర్ నజీరుద్దీన్ తెలిపారు. స్థానిక గుంటూరువారి తోట 7వ లైనులోని హాస్పిటల్‌లో గురువారం పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ నజీరుద్దీన్ మాట్లాడుతూ కార్పొరేట్ వైద్య సేవల్ని పేదలకు నామమాత్రపు ఫీజులకు అందించాలనే ఉద్దేశంతో ఓపీ ఫీజును రూ. 10గా నిర్ణయించామని తెలిపారు. అన్ని రకాల స్పెషాలిటీ వైద్యసేవలు తమ హాస్పిటల్‌లో అందుబాటులో ఉన్నాయని, అన్ని కంపెనీల ఇన్స్యూరెన్సులు కూడా అంగీకరిస్తున్నట్లు చెప్పారు. త్వరలోనే ఆరోగ్యశ్రీ వైద్య సేవలు సైతం ప్రారంభిస్తున్నామని తెలిపారు. సీనియర్ గైనకాలజిస్టు డాక్టర్ షమ సుల్తానా మాట్లాడుతూ సంతాన సమస్యలతో బాధపడే వారికి అతి తక్కువ ఫీజులతో చికిత్సలు అందిస్తున్నామని చెప్పారు. ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ జి.వి.ఎస్.రాహుల్‌రెడ్డి మాట్లాడుతూ మోకీళ్ల సమస్యలతో బాధపడుతున్నవారికి అతి తక్కువ ఫీజుతోనే ఆపరేషన్ చేస్తున్నామని తెలిపారు. క్రిటికల్ కేర్ స్పెషలిస్టు డాక్టర్ బషీరుద్దీన్ మాట్లాడుతూ అత్యవసర వైద్యసేవల్ని రాయితీతో అందిస్తున్నామని పేర్కొన్నారు. సమావేశంలో హాస్పిటల్ మేనేజర్ పి.నాగేశ్వరరావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

విజ్ఞాన్ వర్సిటీ విద్యార్థికి పీహెచ్‌డీ



చేబ్రోలు: వడ్లమూడిలోని విజ్ఞాన్ యూనివర్శిటీలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ మెకానికల్ విభాగానికి చెందిన విద్యార్థి మాగులూరి నాగార్జునకు తమ వర్సిటీ పీహెచ్‌డీ పట్టా అందజేసిందని వైస్ చాన్సలర్ పి.నాగభూషణ్ గురువారం తెలిపారు. ''డిజైన్ అండ్ డెవలప్‌మెంట్ ఆఫ్ ఏ కస్టమైజ్డ్ గైట్ అసిస్టివ్ డివైజ్ ఫర్ ఫూట్ డీఫార్మిటీ డిజార్డర్స్ యూజింగ్ ఆప్టిమైజ్డ్ 3డీ ప్రింటింగ్ ప్రాసెస్ పారామీటర్స్'' అనే అంశంపై విద్యార్థి పరిశోధన చేశారని తెలిపారు. పీహెచ్‌డీ పట్టా పొందిన నాగార్జునను పలువురు అభినందించారు.

పక్కాగా ఓటర్ల జాబితా పరిశీలన



కోయవారిపాలెం (ప్రత్తిపాడు): ఓటర్ల జాబితా పరిశీలన పక్కాగా నిర్వహించడం జరుగుతుందని గుంటూరు ఆర్డీవో ప్రభాకర్ రెడ్డి అన్నారు. ఓటర్ల జాబితా స్పెషల్ సమ్మర్ రివిజన్ కింద గ్రామాల్లో డోర్‌టుడోర్ సర్వే జరుగుతున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో మండల పరిధిలోని కోయవారిపాలెంలో గురువారం ఆర్డీవో ప్రభాకర్ రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇంటింటికీ వెళ్లి ఓటర్ల జాబితాను స్వయంగా పరిశీలించారు. బీఎల్వోలు కచ్చితంగా సర్వే చేయాలని ఆదేశించారు. ఆర్ఐ సాహితి, వీఆర్వో రాణి, ఇంజినీరింగ్ అసిస్టెంట్ వెంకట్ తదితరులున్నారు. అనంతరం గ్రామ సచివాలయాన్ని తనిఖీ చేసి పలు రికార్డులు పరిశీలించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు.

సమగ్రంగా ఓటరు జాబితా సర్వే

పెదకాకాని: నిబంధనల ప్రకారం ఓటరు జాబితా సమగ్ర సవరణ సర్వే జరగాలని తహసీల్దారు పి.రత్నం అన్నారు. మండలంలో నంబూరు రెయిన్‌ట్రీ పార్కులో జరుగుతున్న సర్వేను గురువారం ఆయన తనిఖీ చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారం ఇంటింటి సర్వే పక్కాగా జరగాలని సిబ్బందికి సూచించారు. బూత్‌లెవల్ అధికారి అనీష్, ఏజెంట్లు పాల్గొన్నారు.

ఎయిమ్స్‌కెళ్లి .. పింఛను ఇచ్చి..



చేబ్రోలు: వలంటీర్ల సేవలు అవ్వతాతల మొహాల్లో వెలుగులు నింపుతున్నాయి. శేకూరు గ్రామానికి తట్టుకూళ్ల జానకమ్మ అనే వృద్ధురాలు అనారోగ్యంతో బాధపడుతూ మంగళగిరి ఎయిమ్స్‌లో చికిత్స పొందుతోంది. విషయం తెలుసుకున్న వలంటీర్ రేపూడి ప్రకాశరావు మంగళగిరి వైద్యశాలకు వెళ్లి జానకమ్మకు పింఛను నగదు అందించాడు. వృద్ధురాలి కుటుంబ సభ్యులు వలంటీర్ సేవలను అభినందించారు.

స్ట్రాంగ్ బోన్.. స్ట్రాంగ్ నేషన్

- నేడు బోన్ అండ్ జాయింట్ డే
- ఏటా పెరుగుతున్న ఆర్థోపెడిక్ సమస్యలు
- ఆధునిక జీవన శైలితో ముప్పు
- విటమిన్ డీ లోపంతో తగ్గిపోతున్న ఎముకల పటుత్వం



గుంటూరు మెడికల్: మనిషి నిలబడాలన్నా.. కూర్చోవాలన్నా.. పరుగెత్తాలన్నా..ఏదైనా పనులు చేయాలన్నా ఎముకలు పటిష్టంగా ఉంటేనే సాధ్యమవుతుంది. ఆధునిక జీవనశైలి వల్ల ప్రతి ఏడాది ఆర్థోపెడిక్ సమస్యల బారిన పడుతున్న వారి సంఖ్య రోజురోజుకూ పెరిగిపోతోంది. ఆర్థోపెడిక్ సమస్యలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఇండియన్ ఆర్థోపెడిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 2012 నుంచి ప్రతి ఏడాది ఆగస్టున 4న బోన్ అండ్ జాయింట్ డే ను నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది రోడ్ సేఫ్టీ, సాధారణ ప్రజలకు సైతం రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు ప్రథమ చికిత్స ఏ విధంగా అందించాలనే అంశాలపై అవగాహన కల్పించాలని నిర్ణయించారు. ఈచ్ వన్ – టీచ్ వన్ – సేవ్ వన్, స్ట్రాంగ్ బోన్ – స్ట్రాంగ్ నేషన్ అనే నినాదాలతో బోన్ అండ్ జాయింట్ డే నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా సాక్షి అందిస్తున్న కథనం.

ఆర్థోపెడిక్ సమస్యలకు కారణం

ఆధునిక జీవన శైలి వల్ల ఎక్కువ మంది ఏసీలకే పరిమితమై కొంతసేపు కూడా సూర్యరశ్మి సోకకుండా గదుల్లోనే ఉండి పోతున్నారు. దీంతో విటమిన్ డీ లోపంతో ఎముకల పటుత్వం తగ్గిపోతోంది. ఫాస్ట్‌ఫుడ్స్ ఎక్కువగా తీసుకోవడం, వ్యాయామం చేయకపోవడం ద్వారా కూడా ఒబెసిటీ పెరిగిపోయి ఆర్థోపెడిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. వయస్సు పైబడిన వారు సహజసిద్ధంగా శరీరంలో తగ్గిపోయే కాల్షియాన్ని తిరిగి భర్తీ చేసుకోకుండా నిర్లక్ష్యం చేయడం ద్వారా సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. స్మోకింగ్ కూడా కాల్షియం పెరగకుండా ఎముకల అరుగుదలకు కారణమవుతోంది.

జిల్లావ్యాప్తంగా ఆర్థోపెడిక్ సర్జన్లు 350 మంది ఉన్నారు. ప్రతిరోజూ ఒక్కో వైద్యుడి వద్ద 50 మంది వివిధ రకాల సమస్యలతో చికిత్స పొందుతున్నారు.

జీజీహెచ్‌లో 24 గంటలూ సేవలు

గుంటూరు జీజీహెచ్‌లో ఆర్థోపెడిక్ సమస్యలకు సోమవారం నుంచి శనివారం వరకు ప్రతిరోజూ ఓపీ విభాగంలో ఉచిత సేవలందిస్తున్నారు. రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన వారికి క్యాజువాలిటీలో 24 గంటలూ ఆర్థోపెడిక్ వైద్యులు అందుబాటులో ఉండి, ఆపరేషన్లు చేస్తున్నారు. కార్పొరేట్ ఆసుపత్రుల కంటే దీటుగా అత్యాధునిక మాడ్యూలర్ ఆపరేషన్ థియేటర్లు, సీఆర్మ్ వైద్య పరికరాలతో ఆపరేషన్లు ఉచితంగా చేస్తున్నారు. ప్రతిరోజూ 300 మంది ఓపీ విభాగంలో వైద్య సేవలు పొందుతున్నారు. ప్రతిరోజూ సాధారణ, ఎమర్జెన్సీ ఆపరేషన్లు పదికి పైగా చేస్తున్నారు.

ఉన్నతి ఫౌండేషన్‌తో అవగాహన



వయస్సు పెరిగే కొద్ది జాయింట్లు అరిగిపోవడం సహజం.కీళ్ల అరుగుదల్ని ముందస్తుగా గుర్తిస్తే ఆపరేషన్‌తో పని లేకుండా తగ్గించవచ్చు. బీఎంఆర్ హెల్త్ అండ్ ఎడ్యుకేషనల్ ట్రస్టుకు చెందిన ఉన్నతి ఫౌండేషన్ ద్వారా గతంలో గుంటూరు జీజీహెచ్‌లో సుమారు వంద మందికి ఉచితంగా మోకీళ్ల మార్పిడి ఆపరేషన్లు చేశాం. మోకీళ్ల మార్పిడికి అవసరమైన ఇంప్లాంట్లను సైతం ఉచితంగా అందజేశాం. ఆర్థోపెడిక్ సమస్యలపై ప్రజలకు నిత్యం అవగాహన కల్పించేందుకు ఉన్నతి ఫౌండేషన్ ద్వారా రెండు తెలుగు రాష్ట్రాల్లో అనేక గ్రామాల్లో ఉచిత వైద్య శిబిరాలు, అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నాం. ఎంప్లాయీస్ హెల్త్ స్కీమ్ ద్వారా ప్రభుత్వ ఉద్యోగులకు, హెల్త్ ఇన్స్యూరెన్సు కార్డుల ద్వారా సాధారణ ప్రజలకు ఉచితంగా మోకీళ్ల మార్పిడి ఆపరేషన్ చేస్తున్నాం.

– డాక్టర్ బూసిరెడ్డి నరేంద్రరెడ్డి,
సీనియర్ జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జన్, గుంటూరు

వారం రోజులు అవగాహన కార్యక్రమాలు



బోన్ అండ్ జాయింట్ డేను పురస్కరించుకుని ఆగస్టు 4 నుంచి వారం రోజుల పాటు రాష్ట్ర వ్యాప్తంగా స్కూలు పిల్లలకు క్యాల్షియం ఆవశ్యకత, ఆటో డ్రైవర్లకు రోడ్డు ప్రమాదాల్లో ప్రథమ చికిత్సపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ఎముకలు బలంగా ఉండాలంటే ప్రతిరోజూ తప్పనిసరిగా సమీకృత ఆహారం తీసుకోవాలి. ఆహారంలో గుడ్డు, పాలు, రాగిజావ, పాలకూరతో పాటు ప్రతిరోజూ వ్యాయామం చేయాలి. ఊబకాయం లేకుండా చూసుకోవాలి. జంక్ ఫుడ్, స్మోకింగ్‌కు దూరంగా ఉండాలి.

– డాక్టర్ జి.నరేష్‌బాబు,
ఆర్థోపెడిక్ వైద్యుల సంఘం రాష్ట్ర కార్యదర్శి

నాయీ బ్రాహ్మణులపై అనుచిత వ్యాఖ్యలు సిగ్గుచేటు

నెహ్రూనగర్: నాయీ బ్రాహ్మణులపై టీడీపీ నేత జేసీ ప్రభాకర్‌రెడ్డి అనుచిత వ్యాఖ్యాలు చేయడం సిగ్గుచేటని ఆంధ్రప్రదేశ్ నాయీబ్రాహ్మణ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు తాటికొండ నరసింహారావు గురువారం ఒక ప్రకటనలో ఖండించారు. ఓ ఛానల్‌కి ఇచ్చిన ఇంటర్వ్యూలో నాయీ బ్రాహ్మణుల్ని కించపరుస్తూ, వారి ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే విధంగా మాట్లాడిన ప్రభాకర్‌రెడ్డిపై ప్రభుత్వం చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు నిర్వహిస్తామని ఆయన తెలిపారు.

విధుల్లో చేరిన ఇద్దరు సర్వేయర్లు

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ కార్యాలయంలో గురువారం ఇద్దరు సర్వేయర్లు విధుల్లో చేరారు. గత రెండు నెలలుకు పైగా సర్వేయర్లు లేకపోవడంతో రిపోర్టుల దరఖాస్తులు వందల సంఖ్యలో పెండింగ్‌లో ఉన్నాయి. దీనిపై ప్రజల నుంచి వినతులు ఎక్కువగా రావడంతో కమిషనర్ కీర్తి చేకూ రి జిల్లా ఉన్నతాధికారులుతో మాట్లాడి, సర్వేయర్ల నియామకానికి కృషి చేశారు. తూర్పు, పశ్చిమ మండల తహసీల్దార్ కార్యాలయాల్లో పనిచేస్తున్న వారిని గుంటూరు నగరపాలక సంస్థ కార్యాలయ ఇన్‌చార్జి సర్వేయర్లుగా నియమిస్తూ ఉత్తర్వులు రావడంతో గురువారం విధుల్లో చేరారు. గుంటూరు తూర్పు నియోజకవర్గానికి సీహెచ్. పున్నంరాజు, పశ్చిమ నియోజకవర్గానికి కె. సాంబశివరావు సర్వేయర్లుగా విధులు నిర్వహించనున్నారు.

వైఎస్సార్ సంపూర్ణ పోషణతో ఆరోగ్యం



కార్యక్రమంలో పాల్గొన్న గర్భిణులు, బాలింతలు



ఏటీ అగ్రహారంలో కిట్లతో లబ్ధిదారులు

నెహ్రూనగర్: వైఎస్సార్ సంపూర్ణ పోషణతో గర్భిణులు, బాలింతలు ఆరోగ్యంగా ఉండవచ్చని గుంటూరు అర్బన్ సీడీపీఓ టి. కృష్ణవేణి తెలిపారు. 57వ డివిజన్ అరుంధతీనగర్‌లో గురువారం టేక్ హోం రేషన్స్‌తో పాటు తల్లిపాల వారోత్సవాల్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ పది రకాల సరుకులతో ప్రభుత్వం అందజేస్తున్న టేక్ హోం రేషన్‌ను గర్భిణులు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. 57వ డివిజన్ కార్పొరేటర్ పఠాన్ రిహాన మాట్లాడుతూ వైఎస్సార్ సంపూర్ణ పోషణలో ఇచ్చే బలవర్ధకమైన ఆహారాన్ని గర్భిణులు, బాలింతలు సక్రమంగా తీసుకుని ఆరోగ్యంగా ఉండాలని సూచించారు. సెక్టార్ సూపర్‌వైజర్ తబిత మాట్లాడుతూ 3 నుంచి 6 సంవత్సరాలలోపు చిన్నారుల్ని అంగన్‌వాడీ కేంద్రాలకు తప్పక పంపాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు దాసు, పల్లపు శ్రీను, శృంగారపు శ్రీనివాసరావు, నిత్యానంద చారిటీ ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

30వ డివిజన్‌లో కిట్లు పంపిణీ

గుంటూరు ఎడ్యుకేషన్: 30వ డివిజన్ పరిధిలోని ఏటీ అగ్రహారంలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాల్లో లబ్ధిదారులకు గురువారం వైఎస్సార్ సంపూర్ణ పోషణ టేక్ హోం రేషన్ కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏటీ అగ్రహారం 13వ లైనులోని అంగన్‌వాడీ కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ అచ్చాల వెంకటరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని కిట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నారులు, గర్భిణుల ఆరోగ్య పరిరక్షణతో పాటు బలవర్ధకమైన పౌష్టికాహారాన్ని అందించేందుకు ప్రభుత్వం ఖర్చుకు వెనుకాడకుండా నాణ్యమైన సరుకులతో కిట్లను ఉచితంగా అందజేస్తోందని తెలిపారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ గుంటూరు వెస్ట్–3 మేరీ మహిమర్తిని, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, గర్భిణులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కృషి



ఎస్‌కేబీటీఎం స్కూలుకు కంప్యూటర్లను అందజేస్తున్న ప్రముఖ క్రికెటర్ అంబటి రాయుడు



యాదవ పాఠశాల విద్యార్థులకు స్పోర్ట్స్ కిట్స్‌లను అందజేస్తున్న ప్రముఖ క్రికెటర్ అంబటి రాయుడు

పాత గుంటూరు: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కృషి చేస్తానని ప్రముఖ క్రికెటర్ అంబటి రాయుడు తెలిపారు. పాత గుంటూరులోని యాదవ హైస్కూలు, ఏటీ అగ్రహారంలోని ఎస్‌కేబీటీఎం స్కూలును గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా యాదవ హైస్కూలుకు స్పోర్ట్స్ కిట్, ఎస్‌కేబీటీఎం స్కూలుకు కంప్యూటర్లు, మైక్ సెట్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ పాల్గొనాలని సూచించారు. భవిష్యత్‌లో పాఠశాలలకు అవసరమైన సౌకర్యాల్ని కూడా కల్పిస్తానని తెలిపారు. రెండున్నరేళ్ల పాటు కరోనాతో ప్రజలు చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నారని, వారి సమస్యల్ని తెలుసుకుని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి, పరిష్కరించేందుకే ప్రజల్లోకి వస్తున్నానని ఆయన తెలిపారు. రాజకీయంగా ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని చెప్పారు. అనంతరం పాత గుంటూరులోని 9వ డివిజన్ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి ఆర్. భాస్కరరావు కార్యాలయంలో పలు అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో పాఠశాలల ఉపాధ్యాయులు, నాయకులు పాల్గొన్నారు.

తల్లిపాలు అమృతంతో సమానం

గుంటూరు మెడికల్ : తల్లిపాలు అమృతంతో సమానమని గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ తెలిపారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా గురువారం జీజీహెచ్ ప్రసూతి వార్డులో నర్సింగ్ సూపరింటెండెంట్ ఆశ సజని ఆధ్వర్యంలో బాలింతలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ నవజాత శిశువు ఆరోగ్యంగా పెరగడానికి తల్లిపాలు ఎంతగానో దోహదపడతాయని సూచించారు. బాలింతలు కూడా పోషక విలువలున్న ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. గుడ్లు, కార్యక్రమంలో డెప్యూటీ సూపరింటెండెంట్లు డాక్టర్ డి.ఎస్.ఎస్. శ్రీనివాస ప్రసాద్, డాక్టర్ గోవింద నాయక్, సివిల్ సర్జన్ ఆర్ఎంఓ డాక్టర్ బత్తుల వెంకటసతీష్ కుమార్, డాక్టర్ శ్రావణ్ తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ జిల్లా మేనేజర్ రాజేష్ చంద్ర పాల్గొన్నారు.

బాలింతల్ని సురక్షితంగా ఇంటికి చేర్చండి : సూపరింటెండెంట్

గుంటూరు జీజీహెచ్‌లో ప్రసవానంతరం బాలింతల్ని సకాలంలో ఇళ్ల వద్దకు చేర్చాలని సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ వాహనాల డ్రైవర్లకు చెప్పారు. ఆయన గురువారం గురువారం తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాల పనితీరును పరిశీలించారు. గర్భిణులను ఆసుపత్రికి తీసుకుని వచ్చే కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో 108 అంబులెన్సు, 104 వాహనాల్లో గర్భిణుల్ని ఆసుపత్రికి తీసుకుని వచ్చేవారన్నారు. ఇక నుంచి తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాల్లో తీసుకు రానున్నట్లు ఆయన తెలిపారు.

అమరావతి ముఖద్వారానికి హంగులు

తాడేపల్లిరూరల్: అమరావతి ముఖద్వారం అయిన ప్రకాశం బ్యారేజ్‌కు అనుసంధానంగా ఉన్న బకింగ్ హామ్ కెనాల్ వద్ద ఉన్న ఖాళీ స్థలంలో పార్క్‌ను ఏర్పాటు చేయడంతోపాటు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి, నగర పాలక సంస్థ కమిషనర్ శారదా దేవిలు గురువారం స్థలం పరిశీలించారు. ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ మన చరిత్రను చాటిచెప్పే విధంగా ప్రధాన కూడలిలో మహనీయుల విగ్రహావిష్కరణలు చేపడుతున్నామని, అందులో భాగంగా అమరావతి ముఖద్వారమైన అమరావతి ఉండవల్లి కరకట్ట వెంబడి బకింగ్‌హామ్ వద్ద ప్రకాశం బ్యారేజ్‌కు ఆనుకుని ఉన్న ఖాళీ స్థలంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, సంఘ సంస్కర్త టంగుటూరి ప్రకాశం పంతులు విగ్రహాన్ని ఏర్పాటు చేసి, పార్కును నిర్మిస్తున్నామని ఈనెల 30వ తేదీలోపు విగ్రహాన్ని ఏర్పాటు చేసి ప్రకాశం బ్యారేజ్ నమూనాతో పెయింటింగ్‌లో ఏర్పాటు చేయనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేషన్ డీఈ కృష్ణారెడ్డి, ఏఈ కిషోర్, వైఎస్సార్ సీపీ తాడేపల్లి పట్టణ అధ్యక్షుడు బుర్రముక్కు వేణుగోపాలస్వామిరెడ్డి, పాల్గొన్నారు.

పేదల నివసిస్తున్న ఇళ్లకు పట్టాలివ్వాలి: సీపీఎం



పాత గుంటూరు: జిల్లాలోని ప్రభుత్వ భూముల్లో దీర్ఘకాలంగా ఇళ్లు వేసుకుని నివాసముంటున్న పేదలకు పట్టాలిచ్చి, పక్కా గృహాల నిర్మాణానికి రుణాలు మంజూరు చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు సీహెచ్.బాబూరావు ప్రభుత్వాన్ని కోరారు. బ్రాడీపేటలోని సీపీఎం జిల్లా కార్యాలయంలో గురువారం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఈమని అప్పారావు అధ్యక్షతన కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బాబూరావు మాట్లాడుతూ పేదలకు స్థలాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక నిత్యావసర సరుకుల ధరలు, పెట్రోలు, డీజిల్, వంట గ్యాస్ ధరలు పెరిగిపోయాయని విమర్శించారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా ఐక్యంగా ఉద్యమించాలని శ్రేణులకు పిలుపు నిచ్చారు. రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వై. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మణిపూర్‌లో మూడు నెలల నుంచి తెగల మధ్య ఘర్షణలు జరుగుతున్నా కేంద్ర ప్రభుత్వం స్పందించకపోవడం దుర్మార్గమని ఖండించారు. దేశవ్యాప్తంగా ముస్లింలు, క్రైస్తవులపై దాడులు, హత్యలు జరుగుతున్నాయని, వీటిపై పార్లమెంటులో చర్చించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి పాశం రామారావు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వై.నేతాజి, ఎన్. భావన్నారాయణ, ఎం.రవి, కె.నళినీకాంత్, ఎస్.ఎస్. చెంగయ్య, జిల్లా నాయకులు బి.కోటేశ్వరి, ఎల్.అరుణ పాల్గొన్నారు.

బీఎల్ఓ సస్పెన్షన్

నెహ్రూనగర్: ఎన్నికల విధులకు హాజరు కాకుండా, ప్రొసిడింగ్స్ తీసుకోకుండా విధులకు గైర్హాజరవుతున్న 97 సచివాలయం వార్డు ప్లానింగ్ (బీఎల్ఓ) సెక్రటరీ వజ్రాల రాజ శ్రీనివాసరెడ్డిని సస్పెండ్ చేస్తూ పశ్చిమ ఈఆర్వో, నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ పెద్ది రోజా బుధవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. ఎన్నికల విధుల్లో ప్రతి ఒక్కరూ సక్రమంగా పాల్గొనాలని, నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిపై చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు.

పత్తి పంట పరిశీలన

గుంటూరు రూరల్: ప్రకృతి వ్యవసాయం ద్వారా రైతులు తక్కువ పెట్టుబడితో మంచి దిగుబడులు సాధించవచ్చని లాం ఫాం పత్తి విభాగం ప్రిన్సిపల్ శాస్త్రవేత్త డాక్టర్ ఎం.సుధారాణి తెలిపారు. గురువారం జొన్నలగడ్డ గ్రామంలో పత్తి పంటలో తెగుళ్ల నివారణపై క్షేత్రస్థాయి రైతు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయ విభాగం ఆధ్వర్యంలో పత్తిలో చీడపీడల నివారణను రైతులకు వివరించారు. ప్రకృతి వ్యవసాయం మడల అధికారి కె.గురవయ్య పత్తి పంటను పరిశీలించి, తెగుళ్లు, పురుగులు నివారణ విధానాలను రైతులకు వివరించారు. పత్తిలో అంతర పంటలు వేయడం వల్ల అధిక ఆదాయం ఉంటుందని తెలిపారు. సరిహద్దు పంటగా సజ్జ, జొన్న, మొక్క జొన్న వేయడం వల్ల.. మిత్ర పురుగులు పెరుగుతాయని, వర్షాకాలంలో తెగుళ్లను నియంత్రించవచ్చని తెలిపారు.

ఇన్‌చార్జి ఇంజినీరింగ్ సూపరింటెండెంట్‌గా సుందర్రామిరెడ్డి

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ ఇన్‌చార్జి ఇంజినీరింగ్ సూపరింటెండెంట్‌గా సుందర్రామిరెడ్డిని నియమిస్తూ నగర కమిషనర్ కీర్తి చేకూరి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న పీవీకే భాస్కర్ ఈ నెల 7వరకు వ్యక్తిగత సెలవుపై వెళ్లనున్న నేపథ్యంలో ఆయన స్థానంలో సుందర్రామిరెడ్డిని నియమించారు.

మహిళ ఆత్మహత్య

గుంటూరు ఈస్ట్: మహిళ ఆత్మహత్యపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. సంజీవయ్యనగర్‌లో నివసించే బెల్లంకొండ జ్యోతి (38) మానసిక వ్యాధితో బాధపడుతోంది. గతంలో ఆమెకు ప్రైవేటు ఆసుపత్రిలో నర్సుగా పని చేసిన అనుభవం ఉంది. బుధవారం ఎక్కువ మోతాదులో మత్తు ఇంజక్షను తీసుకుంది. కుటుంబ సభ్యులు గమనించి ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజలకు ఆహ్లాదం, ఆరోగ్యం అందించడమే లక్ష్యం

కమిషనర్ కీర్తి చేకూరి



అధికారులకు ఆదేశాలు జారీ చేస్తున్న కమిషనర్ కీర్తి చేకూరి

నెహ్రూనగర్: నగర ప్రజలకు ఆహ్లాదం, ఆరోగ్యాన్ని అందించేలా నగరపాలక సంస్థ ఖాళీ స్థలాల్లో పార్కుల్ని అభివృద్ధి చేసి, వాటి నిర్వహణలో స్థానికుల్ని భాగస్వాముల్ని చేయాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి ఇంజినీరింగ్ అధికారుల్ని ఆదేశించారు. ఆమె గురువారం టీచర్స్ కాలనీ, ఇన్నర్ రింగ్ రోడ్డులోని వైఎస్సార్ పార్కులు, గడ్డిపాడు, రెడ్డిపాలెం చెరువుల్ని పరిశీలించారు. అభివృద్ధి పనుల వేగవంతంపై ఇంజినీరింగ్ అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో నగరపాలక సంస్థకు చెందిన ఖాళీ స్థలాల్లో పార్కుల్ని అభివృద్ధి చేయడానికి వార్డు సచివాలయాల వారీగా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఇంజినీరింగ్ అధికారుల్ని ఆదేశించారు. పార్కుల్లో ప్రధానంగా వాకింగ్ ట్రాక్, ఓపెన్ జిమ్, పిల్లల ఆట వస్తువులు, పచ్చదనం పెంపు ఉండాలన్నారు. గుర్తించిన పార్కుల్లో బాస్కెట్ బాల్, షటిల్, బ్యాడ్మింటన్ కోర్టుల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. ఓపెన్ జిమ్, చిల్డ్రన్స్ ప్లే ఎక్విమెంట్‌కు మరమ్మతులు వెంటనే చేపట్టాలని ఏఈలను ఆదేశించారు. గడ్డిపాడు, రెడ్డిపాలెం చెరువుల అభివృద్ధికి ప్రతిపాదనల్ని ఇంజినీరింగ్ అధికారులకు చెప్పారు. ఆమె వెంట ఎస్ఈ(ఇన్‌చార్జ్) సుందర్రామిరెడ్డి, ఈఈ శ్రీనివాసరావు, ఏడీహెచ్ రామారావు, ఏసీపీ అజయ్ కుమార్, డీఈఈలు శివకుమార్, శ్రీనివాసరెడ్డి, ఎస్ఎస్‌లు సోమశేఖర్, రాంబాబు, టీపీఎస్ హృదయరాజు, ఏఈలు రాము, అనూష, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఓటర్ల ఇంటింటి సర్వేను వేగవంతం చేయండి

అదనపు కమిషనర్, ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి పెద్ది రోజా

పాత గుంటూరు: ఓటర్ల ఇంటింటి సర్వేను బీఎల్ఓలు మరింత వేగంగా చేపట్టేలా సూపర్‌వైజర్లు పర్యవేక్షణ చేయాలని అదనపు కమిషనర్, ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి పెద్ది రోజా స్పష్టం చేశారు. వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో గురువారం ఏఈఆర్ఓలు, సూపర్‌వైజర్లు, బీఎల్ఓలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కమిషనర్ మాట్లాడుతూ నగరంలో నిర్వహిస్తున్న సర్వేలో వేగం పెరగాలని, బీఎల్ఓలు ప్రతి ఇంటికీ వెళ్లాలని చెప్పారు. సూపర్‌వైజర్లు కూడా ప్రతి రోజు వారి పరిధిలో కొన్ని ప్రాంతాలకు వెళ్లి క్షేత్రస్థాయి సర్వేలో పాల్గొనాలని ఆమె ఆదేశించారు. సర్వేలో అందే ఫారాల్ని ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ చేయాలని, అందుకు తగిన విధంగా అవసరమైన సిబ్బందిని సిద్ధంగా ఉంచాలని ఆమె చెప్పారు. యాప్, ఫారాల దరఖాస్తులపై బీఎల్ఓల అనుమానాలు, సందేహాల్ని తీర్చడానికి ఎన్నికల విభాగంలో సిబ్బందిని కేటాయించుకోవాలని సూచించారు. బదిలీలు, ఇతర కారణాలతో ఖాళీ అయిన బీఎల్ఓల స్థానంలో వెంటనే మరో కార్యదర్శికి విధులు కేటాయిస్తూ ఉత్తర్వులు ఇవ్వాలని ఆదేశించారు. విధుల్లో నిర్లక్ష్యంగా ఉండే వారిపై చర్యలు తీసుకోవాలని తెలిపారు. సమావేశంలో ఏఈఆర్ఓలు బి. శ్రీనివాసరావు, సీహెచ్. శ్రీనివాస్, టి. వెంకట కృష్ణయ్య, సిటీ ప్లానర్ ప్రదీప్ కుమార్, డెప్యూటీ సిటీ ప్లానర్ కోటయ్య, ఎన్నికల విభాగ సూపరింటెండెంట్ పద్మ, మేనేజర్ శివన్నారాయణ పాల్గొన్నారు.

సకల శుభాలను చేకూర్చటం కోసం రాజశ్యామల యాగం



రాజశ్యామల యాగంలో పాల్గొన్న బజరంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు అంబటి మురళీకృష్ణ

- బజరంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ
- మామిళ్ల పల్లిలో రెండో రోజు మహాలక్ష్మి, సుదర్శన హోమాలు

చేబ్రోలు: రాష్ట్రానికి సకల శుభాలను చేకూర్చి, రాజ్యం సస్యశ్యామలంగా, సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షిస్తూ పరమ పవిత్రమైన రాజశ్యామల యాగాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో బజరంగ్ ఫౌండేషన్ చేపట్టింది. బజరంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ ఆధ్వర్యంలో పొన్నూరు మండలం మామిళ్లపల్లి గ్రామంలో మొదలైన రాజశ్యామల యాగం గురువారం రెండో రోజుకు చేరుకుంది. గ్రామదేవత పెద్దేటమ్మతల్లి వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీకాళహస్తికి చెందిన వేద పండితులు వేదమంత్రోచ్చరణలు, మంగళ వాయిద్యాల నడుమ మహాలక్ష్మి, సుదర్శన హోమాల్ని బజరంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ చేతుల మీదుగా జరిపించారు. లోక కల్యాణార్థం సకల జనులకు శుభాల్ని ఆకాంక్షిస్తూ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలనలో రాబోయే రోజుల్లో రాష్ట్రం మరింత అభివృద్ధి సాధించాలని, ఆయన నాయకత్వంలో రాష్ట్రం సరికొత్త పుంతలు తొక్కుతూ అభివృద్ధి పథంలో కొనసాగించాలని ఈ సందర్భంగా అంబటి మురళీకృష్ణ ఆకాంక్షించారు. దీపాలక్ష్మి ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. జగన్నామ సంక్షేమ సంవత్సరంలో భాగంగా కొనసాగుతున్న రాజశ్యామల యాగం సత్ఫలితాలతో ప్రజలంతా సుఖసంతోషాలతో వర్ధిల్లాలని అభిలషించారు. రాజశ్యామల యాగం చివరి రోజున మామిళ్లపల్లిలో పూర్ణాహుతి కార్యక్రమం జరుగుతుందని ఆయన తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.